నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : సంతబొమ్మాళి మండలం నౌపడ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఈఈ శంకర్రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టెక్కలి నౌపడ విద్యుత్తు సబ్స్టేషన్లలో మెయింటినెన్స్ పనులు జరుగుతున్నందున విద్యుత్ సరఫరా నిలుపుదల చేయడం జరుగుతుందన్నారు. ఉదయం 7 గంటల నుంచి 12:00 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. నౌపడ యామాల పేట హనుమంత నాయుడుపేట మూలపేట లింగుడు మేఘవరం తదితర పంచాయతీల్లో కల గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. రొయ్యల చెరువులకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. యోగదారులు సహకరించాలని కోరారు.

నైరుతీ రుతుపవనాలపై సన్నద్ధత

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం : జిల్లాలో నైరుతి రుతుపవనాలు వారం ముందుగానే ప్రవేశించిన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తో కలసి జరిగిన సన్నద్ధత సమీక్ష సమావేశంలో అన్ని శాఖల జిల్లా అధికారులు కలెక్టర్ కార్యాలయం సమావేశం మందిరంలో పాల్గొన్నారు. గత సంవత్సరం ఎదురైన అనుభవాలను దృష్టిలో ఉంచుకొని, ఈసారి మరింత సమగ్రంగా, పటిష్టంగా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. విపత్తుల నిర్వహణ సంస్థ జారీ చేసిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపి) ప్రకారం కార్యాచరణను రూపొందించుకొని అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. ముందస్తు చర్యల్లో భాగంగా జిల్లా, డివిజన్, మండల స్థాయిలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి, వాటి ఫోన్ నంబర్లను ప్రజలకు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ సూచించారు. పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు చెరువుల గట్లను ఉమ్మడిగా తనిఖీ చేసి, వాటి స్థితిగతులపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో వ్యవసాయ శాఖ విత్తనాలు, ఎరువుల పంపిణీపై కార్యాచరణ రూపొందించాలని, నిబంధనలకు విరుద్ధంగా విత్తనాలు, ఎరువులు నిల్వ చేసిన దుకాణాలపై లైసెన్సులు రద్దు చేయాలని హెచ్చరించారు. రైతు సేవా కేంద్రాల ద్వారా విత్తనాలు ఎరువులు పంపిణీకి ఏర్పాట్లు ముమ్మరం చేయాలని తెలియజేశారు.నదీ పరివాహక గ్రామాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, కాజ్‌వేలు రోడ్లపైకి వరద నీరు వచ్చే ప్రాంతాల్లో వాహనాలకు ఆ సమయంలో అనుమతి ఇవ్వకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇరిగేషన్, విద్యుత్ (ఏపీ ఈపీడీసీఎల్), రెవెన్యూ, వ్యవసాయ, హార్టికల్చర్ శాఖలు తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రత్యేకంగా చెప్పారు. గత ఏడాది హిరమండలం-కొత్తూరు మధ్య రోడ్డు పైకి వరద నీరు వచ్చిన విషయాన్ని గుర్తు చేస్తూ, అటువంటి ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఈసమావేశం ద్వారా జిల్లా యంత్రాంగం రుతుపవనాలకు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని, జిల్లా ప్రజల రక్షణే తమ ముఖ్య బాధ్యతగా భావిస్తూ తగిన చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ పుండ్కర్ వెల్లడించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం వెంకటేశ్వరరావు, డిపిఓ భారతీ సౌజన్య, జెడ్పీ సీఈవో శ్రీధర్ రాజా, విపత్తుల నిర్వహణ శాఖ అధికారి రాము, శ్రీకాకుళం ఆర్డీవో సాయి ప్రత్యూష, డిఎం అండ్ హెచ్ ఓ అనిత, ఇరిగేషన్ శాఖ పర్యవేక్షక ఇంజనీర్ సుధాకర్, మత్స్య శాఖ ఉపసంచాలకులు సత్యనారాయణ పలు శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

జగన్... బ్లాక్ మెయిల్ రాజకీయాలు ఆపాలి

- వైసీపీ కార్యకర్తలు జగన్ రెడ్డి మాయలో పడొద్దు

- తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి.రామ్

విశాలాంధ్ర-ఆమదాలవలస : వైఎస్ జగన్ బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడు తున్నారని ఎవరెవరు ఏఅక్రమాల్లో ఉన్నారో తెలుసు నని బెదిరింపులకు దిగుతున్నారని తెలుగుశక్తి అధ్య క్షుడు బి.వి.రామ్ తీవ్ర ఆరోపణలు చేశారు. గురువారం ఆముదాలవలసలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వైసీపీ కార్యక ర్తలు జగన్ మాటలు విని వారి కుటుంబాలను నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. జగన్ మాటలు నమ్మొద్దని, ఆయన రాజకీయ శైలి రౌడీయిజమని ధ్వజమెత్తారు. తాజాగా కడపలో ప్రారంభమైన తెలుగుదేశం మహానాడు అద్భుతంగా జరుగుతోందని, ఈ ఉత్సాహాన్ని చూసి వైసిపి నేతల గుండెల్లో రైళ్లు పరి గెడుతున్నాయని విమర్శించారు. మేళా తరహాలో జరుగుతున్న మహానాడుకు బహుళ ప్రజల సమీక రణ, ఉత్సాహం, క్రమశిక్షణతో వైసిపి నేతల్లో అస హనం పెరిగిందని తెలిపారు. రాష్ట్రాన్ని గాడిలో పెట్టే పనిలో కూటమి ప్రభుత్వం ఉన్నదని, పాలన సవ్యంగా సాగుతోందని అభిప్రాయపడ్డారు. తెలుగు ప్రజల గర్వంగా నిలిచే ఎన్టీఆర్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేందుకు జీఓ విడుదల చేయ దం తెలుగు జాతికి గర్వకారణమని ఆయన పేర్కొ న్నారు. ప్రతి తెలుగువాడు దీన్ని హర్షించాల్సిన అవ సరం ఉందని పేర్కొన్నారు. అనంతరం బి.వి. రామ్, ఎన్టీఆర్ హయాంలో మంత్రిగా పనిచేసిన మాజీ మంత్రి గుండు అప్పల సూర్యనారాయణను అరస వెల్లిలోని ఆయన నివాసంలో కలసి పరామర్శించారు.

కుటుంబ నియంత్రణ భవనం కూలింది సరే...!

ఆ స్థానంలో అంగన్వాడీ భవనమా లేక గ్రామ కళ్యాణమండపం నిర్మిస్తారా...?

- ఈ ప్రక్రియకు దాతలు అంగీకరిస్తారా?

విశాలాంధ్ర-ఆమదాలవలస : గ్రామాల్లో సామాజిక అవసరాల కోసం భూములు అప్పట్లో కేటాయించేవారు. గ్రామ అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వ కార్యాలయ నిర్మాణ భవనాలకు స్థలాలను కేటాయించేందుకు పూర్వం గ్రామ పెద్దలు అప్పటి అధికారుల సహకారంతో అవసరాలకు భూములు కేటాయించేవారు. అకోవకు చెందిన అక్కులపేట గ్రా మంలో మా గ్రామ పెద్దలు స్వర్గీయ బొడ్డేపల్లి రాజగోపాలరావు నేతృత్వంలో పేదలకు ఇల్లు, ప్రభుత్వ కార్యాలయ నిర్మాణాలకు స్థలాలను కేటాయించారు. ఐదు దశాబ్దాల క్రితం సుమారు 80 సెంట్లు భూమిని కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసేందుకు భూమిని కేటాయించి 15 డిసెంబర్ 1973లో ఫ్యామిలీ ప్లానింగ్ సబ్ సెంటర్ అప్పటి రెవిన్యూ అధికారి జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ యూకే రాయ్ ఆధ్వర్యంలో నిర్మాణాలు చేపట్టారు. వెటర్నరీ హాస్పిటల్ పంచాయతీ భవనం పాఠశాల భవనాలకు కూడా బొడ్డేపల్లి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలోని భూములను అందించారు. సుమారు 80 సెంట్లు భూమిని కేటాయిస్తే 52 సంవత్సరాల తరువాత ఆ భవనాలు ఇటీవల వర్షాలకు కూలిపోయాయని స్థానికుల ద్వారా ప్రచారాన్ని నిర్వహించారు. అయితే పంచాయతీ అనుమతితోనే ఆ భవనాన్ని తొలగించి ఆ ప్రాంతంలో అంగన్వాడి భవన నిర్మాణానికి గ్రామస్తులు అంగీకరించారని తెలిసింది. మరి కొంతమంది పెద్దలు ఆపక్కనే దేవాలయం ఉందని కళ్యాణ మండపం తరహాలో భవనం నిర్మిస్తే బాగుంటుందన్న ఉద్దేశంతో దాన్ని తొలగించారని తెలిసింది. ఇదిలా ఉండగా ఇటీవల స్థానిక ఎమ్మెల్యేను కలిసి గ్రామస్తులు గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేస్తే పాడుబడ్డ భవనాన్ని తొలగించి కొత్త నిర్మాణం చేపడతామని ప్రతిపాదన చేశారు. ముందు భవనాన్ని తొలగించి అక్కడ ఉన్న స్థలాన్ని జంగిల్ క్లియరెన్స్ చేయాలని ఇచ్చిన మౌఖిక ఆదేశంతో అక్కడ భవనాన్ని తొలగించినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ఆసుపత్రి కోసం కేటాయించిన స్థలంలో వేరే నిర్మాణాలు చేపట్టడం తలదాతలు అంగీకరిస్తారా అన్న ప్రశ్నలు మొదలవుతున్నాయి. ఎందుకంటే 2004లో అదే కుటుంబానికి చెందిన బొడ్డేపల్లి సత్యవతి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఆసుపత్రి భవనానికి వేరే స్థలాన్ని కేటాయించి పీహెచ్సీ భవనాన్ని నిర్మించారు. ఆ సమయంలోనే ఈ భవనాలను తొలగించేందుకు ఇష్టపడలేదని తెలుస్తోంది. ఈ సమయంలో బొడ్డేపల్లి కుటుంబ సభ్యులు వేరే నిర్మాణాలకు అంగీకరిస్తారా అన్న ప్రశ్న తలెత్తుతుంది. వైద్య ఆరోగ్య శాఖలో డిఎంహెచ్ఓ ఈ భవనాన్ని కూలగొట్టేందుకు అనుమతులు ఇచ్చారని తెలుస్తోంది. ఆరోగ్య శాఖ పరిధిలో ఉన్న ఈ స్థలాన్ని గ్రామ అవసరాలకు వినియోగించు కోవచ్చని ఇటీవల డిఅండ్ఎంహెచ్ఓ అనుమతి చెల్లుబాటు అవుతుందా అని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అంగన్వాడి భవన నిర్మాణానికి గాని కళ్యాణ మండపం నిర్మాణానికి గాని స్థల దాతలు అంగీకరిస్తారా లేదా అనేది తేలకముందే అసలు భవనాన్ని ఎందుకు కూల్చివేశారు అనే సమస్య మొదలవుతుంది. ఏదిఏమైనప్పటికీ ఆరోగ్యశాఖకు అందించే స్థలాన్ని గ్రామస్తులకు ఎలా కేటాయిస్తారనేది తేలవలసి ఉంది. ఎప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి ప్రభుత్వ అవసరాలకు అందించే భవనాన్ని డిఅండ్ఎంహెచ్ఓ ఎందుకు తొలగించమన్నారనేది తెలుసుకోవలసి ఉంది.

డి అడిక్షన్ కేంద్రాలు సమర్ధవంతంగా పనిచేయాలి

- ఎక్సైజ్ అధికారులతో సమీక్షలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: అక్రమంగా తయారవుతున్న మద్యం (ఇలిసిట్లీ డిస్టిల్డ్ లిక్కర్-ఐడి లిక్కర్) వల్ల తలెత్తుతున్న ఆరోగ్య, ఆర్థిక సమస్యలపై జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఐఏఎస్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు చేపట్టిన చర్యలపై, ముఖ్యంగా మద్యం బారిన పడిన కుటుంబాలకు ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పనపై ఆయన ఎక్సైజ్ శాఖ అధికారులతో గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. ఈసమావేశంలో ఎక్సైజ్, వైద్య ఆరోగ్య, పోలీస్, వెల్ఫేర్, విద్యా శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఐడి మద్యం వల్ల బలహీన వర్గాలపై తీవ్ర ప్రభావం పడుతోందని, ఈ కుటుంబాలకు తక్షణమే ప్రత్యామ్నాయ జీవనోపాధిని అందించాలని సూచించారు. మద్యం తయారీకి ఉపయోగించే ముడి సరుకులపై నియంత్రణ పెట్టాలని, ఇందులో ప్రధాన పాత్ర పోషించే వ్యక్తులను గుర్తించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

డీ-అడిక్షన్ కేంద్రాల సమర్థ వినియోగంపై దృష్టి... జిల్లాలో ఏర్పాటు చేసిన కేర్ కమిటీ (కమిటీ ఫర్ ఆల్కహాల్ అవేర్నెస్ రెస్పాన్సివ్ ఎడ్యుకేషన్) ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యకలాపాలను సమీక్షించారు. ఇప్పటివరకు ఈ కమిటీ ద్వారా 16 అవగాహన కార్యక్రమాలు నిర్వహించగా, 595 మంది పాల్గొన్నారు. జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డీ-అడిక్షన్ కేంద్రాన్ని తాను ఒకసారి సందర్శించినట్లు గుర్తు చేసుకున్నారు. ఈ కేంద్రంలో తొమ్మిది మంది చేరగా, ఏడు మంది విజయవంతంగా పునరావాసం పొందినట్లు అధికారులు వెల్లడించారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఐడి మద్యం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఆరోగ్య సమస్యలు, కుటుంబాలపై ప్రభావం, విద్యాభ్యాసం, ఉపాధి వంటి అంశాల్లో సానుకూల మార్పు తీసుకొచ్చేలా చైతన్యం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి నెల 2వ, 4వ శనివారాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, డీ-అడిక్షన్ కేంద్రాలను మరింత సమర్థంగా ఉపయోగించుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ ఎక్సైజ్ రామచంద్రరావు, అదనపు ఎస్పీ కెవి రమణ, డీఎస్పీ సిహెచ్ వివేకానంద, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

యోగా చేయడం అవసరం

విశాలాంధ్ర-నందిగాం: ప్రతి ఒక్కరూ యోగా చేయడం అలవాటు చేసుకోవాలని ఎంపీడీవో పట్నాయక్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో గురువారం యోగాసనాలు చేపట్టారు. యోగాతో ఆరోగ్యంగా ఉండగలమని తెలియజేశారు.

గడ్డిమందు తాగి ఆటో డ్రైవర్ ఆత్మహత్య

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: మండలం చిలకపాలెం గ్రామానికి చెందిన ఒనుము అప్పలరాజు (47) అనే ఆటో డ్రైవర్ గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆటో డ్రైవర్గా జీవనం సాగిస్తున్న అప్పలరాజుకు మద్యం సేవించే అలవాటు ఉంది. అయితే ఈ విషయమై ఇంట్లో భార్య భారతితో గొడవపడుతుండేవాడు. ఇదే క్రమంలో ఈ నెల 27న కూడా గొడవపడ్డాడని, దీంతో మనస్తాపానికి గురైన అప్పలరాజు ఆ రోజు ఉదయం 8.30 గంటల సమయంలో గడ్డిమందును తాగాడు. దీనిని గమనించిన కుటుంబ సభ్యులు శ్రీకాకుళం సర్వజనాసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతిచెందాడు. మృతునికి భార్య, కుమారుడు పవన్కుమార్ ఉన్నారు. కుమారుడు పవన్కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వి.సందీప్ కుమార్ తెలిపారు.

ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు తొలగింపు

విశాలాంధ్ర-మందస : మండలంలోని పలు పంచాయతీలకు చెందిన ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగిస్తూ ఉత్తర్వులను ఉన్నతాధికారులు జారీ చేశారని మందస మండలం ఉపాధి హామీ పథకం ఏపీఓ హరికృష్ణ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని తాళ్ల గురంటి, బేతాళపురం, రాంపురం, సరియాపల్లి, మందస, పొత్తంగి, భోగాపురం పంచాయతీ లకు చెందిన 9 మంది ఉపాధి పథకం ఫీల్డ్ అసిస్టెంట్ తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని ఆయన తెలిపారు ఈ ఉత్తర్వులను తొలగింపుకు గురైన ఫీల్డ్ అసిస్టెంట్లకు అందజేసినట్లు ఆయన తెలిపారు.

మండల కేంద్రంలో యోగాంధ్ర కార్యక్రమం

విశాలాంధ్ర-ఆనందపురం : ఆనందపురం మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. మండల స్థాయి ప్రోటోకాల్ లో భాగంగా యోగా శిక్షణ, యోగ గురువు సోమ స్ఫూర్తి, నాగరాజు, యోగా యోగా ట్రైనర్ల ఆధ్వర్యంలో గ్రామ సచివాలయం ఉద్యోగులు, పలువురు కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యోగా విశిష్టత యోగా వలన ఉపయోగాలు గురించి తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సమగ్ర శిక్ష అభియాన్ ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ పద్మావతి, ఎంపీడీవో వి జానకి తదితరులు పాల్గొన్నారు.

మహానాడులో సీఎంను కలిసిన టీడీపీ నాయకులు

విశాలాంధ్ర-రణస్థలం : ఆంధ్రప్రదేశ్‌లో అన్న ఎన్టీరామారావు జయంతి పురస్కారాలు కడప మహానాడు పురస్కారాలు ఎన్నడు లేనివిధంగా అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న ఈ పండగలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడుని కలిసిన ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు పిన్నింటి వెంకట భానుజీ నాయుడు మరియు విజయనగరం పార్లమెంటు సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు ఆనందం వ్యక్తం చేశారు. ఈ మహోన్నత కార్యక్రమం మహనీయుడు కోసం చేయడం మహా అదృష్టంగా భావిస్తున్నామని, అదేవిధంగా 800 కిలోమీటర్లు వచ్చిన శ్రీకాకుళం జిల్లా సర్పంచులు, ఎంపిటిసిలు, కార్యకర్తలు టిడిపి కుటుంబ సభ్యులకు పాల్గొనడం జరిగిందని వారు ఆనందం వ్యక్తపరిచారు.

తోటపల్లి ఆయకట్టు పరిశీలన

విశాలాంధ్ర-రణస్థలం : కలెక్టర్ ఆదేశాలు మేరకు గురువారం రణస్థలం మండలం లో తోటపల్లి కాలువ ఆయకట్టు భూమి నీటి పన్ను కొరకు, జిల్లా వ్యవసాయ అధికారి కోరాడ త్రినాథరావు రణస్థలం మండలంలో తోటపల్లి కాలువ ఆయకట్టుని పరిశీలించి వేల్పురాయి, కమ్మసిగడం, బంటుపల్లి రైతులతో ముఖాముఖీ చర్చించారు. గడిచిన సంవత్సరంలో కాలువ నీరు విడుదల అయ్యిందా లేదా ఈ పంట నమోదులో నీటి వసతి పంటల స్థితిగతులని రైతులతో పాటు వ్యవసాయశాఖ సిబ్బందితో చర్చించారు. ఈ కార్య క్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి విజయభాస్కర్ వీఏఏ తదితరులు పాల్గొన్నారు.

మహానాడులో చంద్రబాబును కలిసిన చౌదరి అవినాష్

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : కడపలో మూడు రోజులుగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహానాడులో తెదేపా నేతలు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. డీసీఎంఎస్ అధ్యక్షునిగా నియమితులైన చౌదరి అవినాష్ మహానాడులో గురువారం తెదేపా అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్‌ను ప్రత్యేకంగా కలిశారు. డీసీఎంఎస్ అధ్యక్షుడుగా నియమితులైన అవినాష్ను వారు అభినందించారు. డీసీఎంఎస్ అధ్యక్ష పదవిని బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని వారు సూచించారని అవినాష్ తెలిపారు.

టిడిపి జాతీయ అధ్యక్షులుగా చంద్రబాబు ఏకగ్రీవ ఎన్నిక

- హర్షం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే ఎంజీఆర్

- టీడీపీ అధినేతకు శుభాకాంక్షలు

విశాలాంధ్ర-హిరమండలం/పాతపట్నం : 1995 సంవత్సరం నుంచి ఈరోజు వరకు మూడు దశాబ్దాలుగా తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులుగా నారా చంద్రబాబునాయుడు ఏకగ్రీవంగా ఎన్నిక కావడంపట్ల పాతపట్నం నియోజకవర్గం శాసనసభ్యులు, అసెంబ్లీ ప్రివిలేజ్ కమిటీ మెంబర్ మామిడి గోవిందరావు గురువారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నిక కాబడిన చంద్రబాబు నాయుడుకి కడప మహానాడు వేదికపై బుధవారం ఎమ్మెల్యే గోవిందరావు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు పోలిట్ బ్యూరో సభ్యులను, మంత్రులను ఎమ్మెల్సీలను, సహచర శాసనసభ్యులను, పార్టీ పెద్దలకు ఎమ్మెల్యే ఎం.జి ఆర్భుధవారం కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే చంద్రబాబునాయుడు నాయకత్వంలో పనిచేస్తున్నందుకు గర్వంగా ఉందని, రానున్న రోజుల్లో జాతీయ, రాష్ట్ర స్థాయిలో మరెన్నో విజయాలను అందుకుంటామని ఆశాభావం వ్యక్తం చేస్తూ నాలాంటి సామాన్య వ్యక్తులను చట్టసభలకు పంపించిన ఘనతచంద్రబాబు నాయుడుకే దక్కుతుందని అందుకు జీవితాంతం రుణపడి ఉంటానని ఎం.జి.ఆర్ తెలియజేశారు.

రేషన్ డీలర్‌పై చర్యలు తీసుకోవాలి : తహసిల్దార్‌కు గ్రామస్తుల వినతి

విశాలాంధ్ర-కవిటి:మండలంలోని లండారిపుట్టుగ గ్రామంలో ఈ నెలలో పంపిణీ చేయవలసిన రేషన్ ఇంత వరకు చాలా మంది లబ్ధిదారులకు రేషన్ డీలర్ ఇవ్వలేదని రేషన్ డీలర్ పై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు తహసిల్దార్ బెహరా మురళీమోహన రావుకు వినతి పత్రం అందజేశారు. ఈమేరకు గురువారం తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ మురళీమోహనరావుకు కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ మే నెలకు సంబంధించిన రేషన్ సరుకులు నేటి వరకు పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు అందజేయలేదని ఈ విషయంపై డీలర్‌ను ప్రశ్నించగా రేషన్ తక్కువగా వచ్చిందని సొంత డబ్బులుతో రేషన్ ఇస్తానని చెప్పి లబ్ధిదారులను మోసం చేస్తున్నారని తెలిపారు. గ్రామంలోని రేషన్ డిపో ఉన్నప్పటికీ అక్కడ సరుకులు నిల్వ చేయకుండా బయట ప్రాంతంలో నిల్వ ఉంచి కొంత సరుకు మాత్రమే తెచ్చి పంపిణీ సాగిస్తున్నారని మిగతా లబ్ధిదారులకు మొండి చెయ్యి చూపిస్తున్నారని వాపోయారు. గతంలో కూడా రేషన్ అక్రమ దందా చేసినందుకు సస్పెండ్ కూడా అయ్యారని కానీ అతనిలో ఎటువంటి మార్పు రాలేదని అన్నారు. ఈనెల రేషన్ ఇప్పించి రేషన్ డీలర్ పై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి అందజేసిన వారిలో ఎన్. ఎర్రయ్య తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ సోదాలతో నేర నియంత్రణ చర్యలు

విశాలాంధ్ర-టెక్కలి: నేర నియంత్రణ చర్యలలో భాగంగా టెక్కలి పోలీసు సబ్ డివిజన్ పరిధిలో పోలీసులు గురువారం ఉదయం కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ సోదాలు నిర్వహించి, విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. శ్రీకాకుళం జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి ఐపీఎస్ ఆదేశాల మేరకు గురువారం ఉదయానికి కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌లో భాగంగా జిల్లాలో టెక్కలి, పాతపట్నం, కొత్తూరు, నరసన్నపేట, కోటబొమ్మాళి పోలిసు స్టేషనులు పరిధిలో సిఐ, ఎస్ఐల అధ్వర్యంలో పోలిసు సిబ్బంది వారి పరిధిలో ఉన్న పలు వార్డు, గ్రామాలలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. గ్రామాల్లో ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేసి ఊరు చివర ప్రాంతాల్లో సోదాలు చేసి అక్రమ మద్యం, గంజాయి, నిల్వలుపై ఆరా తీశారు. పాత నేరస్థులు, ట్రబుల్ మాంగర్స్,కొత్త, అనుమానిత,నేర చరిత్ర కల్గిన వ్యక్తులు ఇళ్లల్లో సోదాలు నిర్వహించి, వారి జీవన విధానం,వృత్తి విధానం పై ఆరా తీసి చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలు అరికట్టి,నేర నియంత్రణ చర్యలు చేపడ్తున్న జిల్లా పోలీసులు. ఈ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ తనిఖీల్లో ఏటువంటి, సరైన వాహన పత్రాలు లేని ద్విచక్ర వాహనాలు గుర్తించి, పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఎన్ వై కే ఆధ్వర్యంలో యోగాసనాల ప్రదర్శన

విశాలాంధ్ర-శ్రీకాకుళం : యోగాంధ్ర 2025 వేడుకల సన్నాహకాల్లో భాగంగా శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో గురువారం ఉదయం నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక యోగాసనాల ప్రదర్శన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నేషనల్ యువత సేవకులు మరియు వివిధ యువజన సంఘాల సభ్యులతో సహా మొత్తం 70మంది యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. యోగా గురువులు మురళి మరియు టీ. స్వాతి పర్యవేక్షణలో విశాఖ బి కాలనీ సాయిబాబా మందిరం ఆవరణలో జరిగిన ఈ ప్రదర్శనలో పాల్గొన్న యువత, వివిధ రకాల యోగాసనాలను సమర్థవంతంగా ప్రదర్శించి తమ శారీరక దృఢత్వాన్ని, ఫిట్‌నెస్‌ను చాటారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు కె.మురళీధర్‌రావు కూడా యువతతో కలిసి యోగాసనాలలో పాల్గొని వారికి స్ఫూర్తినిచ్చారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపు మేరకు జరిగిన ఈ కార్యక్రమానికి నెహ్రూ యువ కేంద్ర డిప్యూటీ డైరెక్టర్ కె.వి. ఉజ్వల్, అకౌంట్స్ ఆఫీసర్ డి.శ్రీనివాస్, సెట్‌శ్రీ సీఇఓ బి. ప్రసాద రావు హాజరై యువతను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, యోగాను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండాలని సూచించారు.

విద్యుత్ మృతుల కుటుంబాలకు 'సాడి' సహాయం

విశాలాంధ్ర-సోంపేట/కంచిలి : కంచిలి మండలం తలతంపర పంచాయతీ సిర్లపుట్టుగ గ్రామంలో ఇటీవల అమ్మవారి సంబరాల్లో చోటు చేసుకున్న విద్యుత్ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు వైకాపా సీనియర్ నేత మాజీ సీడాప్ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి గురువారం ఆర్థిక సహాయం అందజేశారు. సిర్లపుట్టుగ గ్రామానికి వెళ్లి మరణించిన ముగ్గురు కుటుంబాలను ఆయన పరామర్శించారు. వారికి ధైర్యం చెబుతూ ఒక్కొక్క కుటుంబానికి 5వేల రూపాయలు చొప్పున మొత్తం 15వేల రూపాయల నగదు సహాయం అందించి తన మానవత్వాన్ని చాటుకున్నారు. ఇంత ఘోరమైన ప్రమాదంపై ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేకపోవడం బాధాకరమని అన్నారు. ఆయన విలేకర్లతో కలిసి బాధిత కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే ఎక్స్‌గ్రేషియా అందజేయాలని కోరారు. గత రెండు నెలలుగా అనేక గ్రామాల్లో గ్రామదేవతల సంబరాలు జరుగుతున్నాయని ఇటువంటి సంబరాల విషయంలో విద్యుత్, అగ్నిమాపక, ఆరోగ్య, పారిశుధ్య శాఖలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. జరిగిన ప్రమాదంపై వెంటనే దర్యాప్తు జరిపించి బాధిత కుటుంబాలకు సహాయపడాలని ఏపీఈపీడీసీఎల్ సీఎండీకి లేఖ రాసినట్లు తెలిపారు.

కొత్తూరులో వాహనాల తనిఖీలు

విశాలాంధ్ర-కొత్తూరు : మండల కేంద్రం కొత్తూరులో పోలీసులు వాహనాలను తనిఖీలు చేసారు సీఐ ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో జరిగిన తనిఖీల్లో గతంలో వేసిన చలానాల సొమ్ములను ఫైనాలిటీ దారుల నుండి వసూలు చేశారు మోటర్ వాహనాల చట్టాన్ని కచ్చితంగా అమలు చేస్తాం అని సీఐ అన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-కవిటి : మహిళలకు ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా అందిస్తున్న ఉచిత కుట్టు శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వి.విశ్వేశ్వరరావు అన్నారు. ఈ మేరకు గురువారం కవిటిలో జరుగుతున్న కుట్టు శిక్షణ కార్యక్రమంను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మూడు నెలలో నేర్చుకున్న శిక్షణ ద్వారా ఇంటివద్ద ఉండి ఉపాధి పొందవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి ఎంపీడీవో అబ్దుల్ ఖాన్, కుట్టుటైనర్ పి యశోద,ఎప్పిఓ సిబ్బంది పాల్గొన్నారు.

11ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు



విశాలాంధ్ర-నరసన్నపేట: పట్టణంలో పురుషోత్తమ నగర్ కాలనీలో గురువారం వేకువజామున 4గంటలకు నరసన్నపేట సి.ఐ, ఎం.శ్రీనివాసరావు అధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సంధర్భంగా కాలనీలో ఇంటింటికీ పోలీసులు వెళ్ళి సోదాలు చేశారు. కాలనీలోకి కొత్త వ్యక్తులు ఆచూకీ, అనుమానితులు, అక్రమ మద్యం, గంజాయి రవాణా గురించి, ఎటువంటి పేపర్లు లేకుండా వాహనాలు గురించి కార్డెన్ సెర్చ్‌లో భాగంగా తనిఖీలు చేశారు. ఈ సంధర్భంగా సుమారు 11ద్వి చక్ర వాహనాలు స్వాధీనం చేసుకొని, పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో నరసన్నపేట, పోలాకి, జలుమూరు, సారవకోట ఎస్.ఐలు, సిహెచ్.దుర్గాప్రసాద్, అశోక్‌బాబు, రంజిత్, అనిల్‌కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీపురం టోల్ గేట్ సిబ్బంది నిర్వాకం..లారీ డ్రైవర్లకు ఆశనిపాతం..

టోల్ వసూలు విషయంలో లారీ డ్రైవర్ టోల్ గేట్ సిబ్బంది మధ్య వాగ్వివాదం..!

కాంట్రాక్టును రద్దుచేసి టోల్ గేట్ ను ప్రభుత్వమే నిర్వహించాలి

న్యూ ఆంధ్ర మోటార్ ట్రక్కర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మహారథి

విశాలాంధ్ర-పలాస: జాతీయ రహదారి పలాస మండలం లక్ష్మీపురం సమీపంలో ఉన్న టోల్ గేట్ సిబ్బంది నిర్వాకం వలన అనేక మంది లారీ డ్రైవర్లకు ఆశనిపాతంగా మారుతోంది. ఈ టోల్ గేట్ సిబ్బంది దురుసు ప్రవర్తన, లారీ డ్రైవర్లతో వాగ్వివాదాలు పెచ్చు మీరుతున్నాయి. లక్ష్మీపురం టోల్ గేట్ కు రాను పోను 10 గేట్లు ఉన్నాయి. వీటి మీదుగా ప్రతి రోజు నిమిషానికి 20 నుండి 25 వరకు లారీలు వెళ్తుంటాయి. ఫాస్ట్ ట్రాక్ ఉన్న లారీలకు ఎటువంటి ఇబ్బందులు లేకపోయినా, ఫాస్ట్ ట్రాక్ లేని లారీల డ్రైవర్లకు చుక్కలు చూపించడం సిబ్బందికి పరిపాటిగా మారింది. రాత్రి సమయాల్లో విధులు నిర్వహిస్తున్న టోల్ గేట్ సిబ్బంది ఆగడాలు మరీ మితిమీరి పోయాయని పలువురు లారీ డ్రైవర్లు ఆరోపిస్తున్నారు. టోల్ గేట్ వద్ద ఉన్న బరువుల మిషన్లలో తేడా రావడంతో బరువుతో ఉన్న లారీలను సిబ్బంది గేట్లను మార్చడం ఇక్కడ పరిపాటిగా మారింది. ఒక లారీకి సరుకు రవాణాకు సంబంధించి అన్ని పత్రాలు సక్రమంగా ఉన్నా టోల్ గేట్ సిబ్బందికి చేతులు తడపవలసిందే. లేదంటే ఆ లారీని అక్కడే నిలుపుదల చేస్తుంటారనే ఆరోపణలు వినవస్తున్నాయి. ఇలాంటి సంఘటన లక్ష్మీపురం టోల్ గేట్ వద్ద బుధవారం రాత్రి చోటు చేసుకుంది. విజయవాడకు చెందిన ఏపీ 05 టీ.సి 4949 లారీ జంషెడ్ పూర్(టాటా) నుండి ఐరన్ ప్లేట్ల లోడ్ తో కాకినాడ వెళు తుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక లారీలో 36 టన్నుల 400 కేజీలు లోడ్ తో వెళ్లాలి. అయితే ఐరన్ లోడ్ లారీలో లారీ బరువు 10 క్వింటాల 800 కేజీలు తో పాటు 25 టన్నుల 293 కేజీలు మొత్తం 36 టన్నుల 96 కేజీల బరువుతో గమ్యానికి చేరుకుంటుంది. అప్పటికే టాటా నుండి 9 టోల్ గేట్లను దాటి వచ్చినప్పుడు లోడ్ విషయంలో ఎటువంటి అభ్యంతరం లేకపోయినా లక్ష్మీపురం టోల్ గేట్ వద్ద మాత్రం సిబ్బంది అభ్యంతరం వ్యక్తం చేశారని లారీ డ్రైవర్ లంక రమేష్, క్లీనర్ లంక సురేష్ లు తెలిపారు. తాము పరిమితి లోడుతో వస్తున్నామని, లోడింగ్ సమయంలోనే టాటా కంపెనీ కెపాసిటీకి మించి లోడ్ చేయదని తెలియజేసిన అదనంగా రుసుము చెల్లించమని టోల్ గేట్ సిబ్బంది తమపై దౌర్జన్యానికి దిగారని డ్రైవర్ రమేష్ ఆరోపించారు. లోడ్ తో ఉన్న తమ లారీని టోల్ గేట్ కార్యాలయం వద్ద నిలుపుదల చేశారని ఆరోపించారు. ఈ విషయాన్ని డ్రైవర్ 112 కు సమాచారం అందిస్తే పోలీసులు వచ్చి వారి వాహనంలో తనను, క్లినర్ ను పోలీస్ స్టేషన్ వద్దకు పట్టుకుపోయి తాము మద్యం సేవించామా లేదా అని పరీక్ష చేశారని తెలిపారు. పరీక్షలో ఎటువంటి మద్యం ఆనవాళ్ళు లేకపోవడంతో 1035 రూపాయలు అపరాధ రుసుం కింద చలానా వసూలు చేసి టోల్ గేట్ సిబ్బందికి ఏమి అనకుండా నిశి రాత్రిలో తమను మార్గమధ్యంలో పోలీసులు వదిలేసారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాగోలా టోల్ గేట్ వద్దకు చేరి జరిగిన సంఘటన వివరాలను విజయవాడ నమత లారీ యూనియన్ కు తెలియజేశామని డ్రైవర్ రమేష్ తెలిపారు. సుమారు 14 గంటల పాటు లారీతో ఉండిపోయామని తమకు జరిగిన నష్టాన్ని ఎవరు భరిస్తారని ప్రశ్నించారు. ఏ టోల్ గేట్ లో లేని నిబంధనలు కేవలం లక్ష్మీపురం టోల్ గేట్ కి ఎలా వర్తిస్తాయని ప్రశ్నించారు. ఈ సమాచారం తెలుసుకున్న కాశీబుగ్గ ఏఎస్ఐ గోవిందరాజులు లక్ష్మీపురం టోల్ గేట్ వద్దకు చేరుకొని ఇరు వర్గాలతో చర్చించారు.

లక్ష్మీపురం టోల్ కాంటాక్ట్ రద్దుచేసి ప్రభుత్వమే నిర్వహించాలి

న్యూ ఆంధ్ర మోటార్ ట్రక్కర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మహారథి

దేశంలో ఏ టోల్ గేట్లు లేని నిబంధనలు లక్ష్మీపురం టోల్ గేట్ కు మాత్రమే ఉన్నాయని, గతంలో కూడా ఎన్నో ఆటంకాలు ఈ టోల్ గేట్ నుండి వచ్చాయని నమత లారీ యూనియన్ అధ్యక్షులు మహారథి అన్నారు. డ్రైవర్ రమేష్ ఫిర్యాదు మేరకు విజయవాడ నుండి మహారథి గురువారం లక్ష్మీపురం టోల్ గేట్ వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశంలో ఏ టోల్ గేటుకు లేని నిబంధనలు కేవలం లక్ష్మీపురం టోల్ గేట్ మాత్రమే ఉన్నాయని, లారీలో ఓవర్ లోడ్ ఉందో లేదో తనిఖీ చేయకుండా ఇక్కడ సిబ్బంది వ్యవహరిస్తుంటారని, గతంలో కూడా అనేక సంఘటనలు చోటు చేసుకున్నాయని గుర్తు చేశారు. ఓవర్ లోడ్ లేదన్నా డబ్బులు కట్టి వెళ్లాలని లేకపోతే డ్రైవర్ల పై దాడులు చేయడం పరిపాటిగా మారిందన్నారు. ఏడాది కాలంగా ఇలాగే జరుగుతున్నదని యాజమాన్యం దృష్టికి తీసుకు వెళ్లినప్పుడు క్షమాపణ చెప్పడం జరిగిందని మరల సిబ్బంది డ్రైవర్లపై దాడులు చేయడం బాధాకరమన్నారు. బుధవారం రాత్రి 5వ గేటు నుండి లోడుతో లారీ వెళ్తుంటే వేయింగ్ మిషన్ అధికంగా బరువు చూపిస్తుందని, నాలుగో గేటు ద్వారా వెళ్లాలని సిబ్బంది సూచిస్తుంటారని, వెనుక అనేక వాహనాలు బారులు తీరి ఉంటే డ్రైవర్ ఎలా వెళ్లగలరని ప్రశ్నించారు. ఒకవేళ అధిక బరువు ఉంటే ఎదురుగా ఉన్న వేయింగ్ మిషన్ ద్వారా బరువును కాటా వేయించాలని డ్రైవర్లు కోరిన ఆ దిశగా సిబ్బంది చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. అధిక బరువులతో ఇసుక లారీలు టోల్ గేట్ మీదుగా వెళ్తున్న వారిపై దృష్టి సారించని సిబ్బంది కేవలం లారీ డ్రైవర్ల వద్ద డబ్బులు దండుకోవడానికేనని ఆరోపించారు. ఒకవేళ అధిక బరువుకు డబ్బులు చెల్లించిన రసీదులు ఇవ్వరని ఇలా చాలా లారీలకు జరిగాయని అన్నారు. లారీలలో లోడు లకు ఏమైనా సమస్యలు ఉంటే కాటా పెట్టుకుని వసూలు చేసుకోవచ్చని, అలా కాకుండా అనవసరంగా లారీలను నిలుపుదల చేయడం సమంజసం కాదన్నారు. పశ్చిమ బెంగాల్, ఒడిస్సా రాష్ట్రాలకు చెందిన లారీలను ఈ విధంగానే ఆపి వేలాది రూపాయలు టోల్ గేట్ సిబ్బంది వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఓవర్ లోడ్ లేకపోయినా ముందుగా డబ్బులు కట్టాలని డిమాండ్ చేస్తున్నారని ఈ విధంగా ఏ టోల్ గేట్ లో ఉండదని అన్నారు. బుధవారం రాత్రి నిలుపుదల చేసిన లారీకి టోల్ గేట్ యాజమాన్యం నష్ట పరిహారం చెల్లించాలని, దురుసుగా ప్రవర్తించిన సిబ్బందిపై, అలాగే డ్రైవర్ పై నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసులపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటన జరిగితే తమ యూనియన్ తరపున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

సూపర్ సక్సెస్ మహానాడు

- తరలివచ్చిన తెలుగు తమ్ముళ్లు

- పసుపు మయంగా మారిన కడప

విశాలాంధ్ర-రణస్థలం : కడప తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా కడపలో స్వర్గీయ నందమూరి తారక రామారావు పుట్టి నరోజు పురస్కరించుకొని గత 3 రోజులుగా జరిగిన మహానాడు సూపర్ సక్సెస్ అయింది. ఈ మహానాడు కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, యువ నాయకులు ఐటీ మంత్రి నారా లోకేష్ మాటలతో కార్యకర్తలను నాయకులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి విజయనగరం పార్లమెంటరీ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు, విజయనగరం పార్లమెంటరీ అధ్యక్షులు కిమిడి నాగార్జున, రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ గురజాపు రాము, శ్రీకాకుళం పార్లమెంటరీ టిడిపి రజక సాధికారిక స్టేట్ కమిటీ నాయకులు నౌపడ రామారావు, అనకాపల్లి పార్లమెంటరీ టిడిపి రజక సాధికారిక కమిటీ స్టేట్ నాయకులు అద్దురి శంకర్, విశాఖపట్నం పార్లమెంటరీ రజక యూత్ కన్వీనర్ చీపురుపల్లి స్వరూప్, ఉత్తరాంధ్ర జిల్లాల తెలుగుదేశం పార్టీ రజక సాధికారక కమిటీ నాయకులు రజక సంఘాల నాయకులు తదితరులు వున్నారు. మహానాడు కార్యక్రమం విజయవంతం చేయడానికి కృషి చేసినటువంటి తెలుగు తమ్ముళ్లు అందరికీ డైరెక్టర్ రాము ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

కేశవస్వామి భూములు బహిరంగ వేలంపాట

విశాలాంధ్ర-ఆమదాలవలస : దేవాదాయ శాఖ ఆధ్వర్యంలోని బూర్జ మండలంలోని తోటాడ గ్రామ పరిధిలో ఉన్న శ్రీ కేశవ స్వామి వారి భూములు బహిరంగ వేలం పాట జూన్ 4వ తేదీ 10.30 నిమిషాలకు 13 ఎకరాల 98 సెంట్లు మూడు సంవత్సరాల లీజు హక్కు ఇవ్వనున్నట్లు ఆలయ కార్యనిర్వాహక అధికారి టి రవి ఒక ప్రకటనలో తెలిపారు. తోటాడ గ్రామంలో ఉన్న శ్రీ కేశవ స్వామి దేవస్థానానికి సంబంధించిన భూములు, చెరువులు, చెట్లు మొదలగునవి గ్రామ పరిధిలో ఉన్నవి. వాటి ఫలసాయము మూడు సంవత్సరాల పాటు వేలం పాటలో సొంతం చేసుకున్న వారికి ఆలయ నిబం ధనల మేరకు అందించడం జరుగుతుందని తెలి పారు. మూడు జూన్ 2028 వరకు లీజు హక్కు ఉంటుందన్నారు. సదరు బహిరంగ వేలం పాటలో పాల్గొనవలసిన వారు ఆముదాలవలసలోని శ్రీ వెంకటేశ్వర ఆలయం ఆవరణలో పాట నిర్వ హించనున్నట్లు తెలిపారు.

ఖరీఫ్ సాగులో మేలైన విత్తన రకాల ఎంపిక అవసరం

కొండవలసలో అవగాహన సదస్సు

విశాలాంధ్ర-ఆమదాలవలస : ఖరీఫ్ సాగు చేసే రైతులు మేలైన విత్తన రకాలను ఎంపిక చేసుకో వాలని ఏడిఏ రాజగోపాల్ అన్నారు. సరుబుజ్జిలి మండలం కొండవలస గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయశాఖ సమన్వయంతో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వ హించారు. ఖరీఫ్ పంట కాలంలో పాటించాల్సిన అం శాలైన విత్తన రకాలు, ఎంపిక, వాటి లభ్యత గురించి రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ అనుబంధ రంగాలలో రైతులు ముందస్తుగా తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అందుతున్న రైతు సంక్షేమ పథకాలను వివరించారు. రైతులు శాస్త్రవేత్తల ముఖాముఖి కార్యక్రమంలో రైతులు అడిగిన సందేహాలకు శాస్త్రవేత్తలు బాలకృష్ణ, శైలజ, అనూష సూచనలు చేశారు. వ్యవసాయ అనుబంధ రంగాలైన చేపల పెంపకం, పశుపోషణ, కోళ్ల పెంపకం చేపట్టడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని కెవికె శాస్త్రవేత్త బాలకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధ రంగాల క్షేత్రస్థాయి సిబ్బంది, కెవికె, వ్యవసాయ పరిశోధనా మండలి శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

వైకాపా నేతలు పరామర్శ

విశాలాంధ్ర-సోంపేట/కంచిలి : కంచిలి మండలం తలతంపర పంచాయతీ సిర్లపుట్టుగలో ఇటీవల చోటు చేసుకున్న విద్యుత్ ప్రమాద ఘటనలో మృతుల కుటుంబాలను కంచిలి మండలం వైసీపీ నేతలు గురువారం పరామర్శించారు. ఎంపీపీ పైల దేవదాసురెడ్డి, మండల వైసీపీ కన్వీనర్ వజ్జ మృత్యుంజయం, ఎంఎస్‌పల్లి సర్పంచ్ సురేష్, లడ్డుకేశవపాత్రో తదితరులు బాధితులతో కలిసి మాట్లాడారు. వారికి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

కన్నుల పండగగా ధ్వజస్తంబం పునఃప్రతిష్ట

విశాలాంధ్ర-కవిటి: కవిటి మండలం జగతి గ్రామంలోని శ్రీజగదీశ్వర ఆలయం వద్ద గ్రామస్తుల ఆధ్వర్యంలో ధ్వజస్తంబం, పానుమట్టం, నవగ్రహ మండపం పునః ప్రతిష్ట కార్యక్రమం కన్నుల పండగగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు ఆధ్వర్యంలో విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచన, యాగశాల సంస్కారం, అఖండ దీపారాధన, అగ్ని ప్రతిష్ట, జలాధివాసం, నారిజనం నిర్వహించి ధ్వజస్తంబంకు ప్రత్యేక పూజలు చేసి ఆలయం వద్దకు తీసుకువచ్చారు. ఇందులో గ్రామస్తులు,ఆలయ కమిటి సభ్యులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

దళితుల దీనగాథ..

కటిక పేదరికం అనుభవిస్తున్న

దండాసి కులం ప్రజలు..!

విశాలాంధ్ర-పలాస/మందస: ప్రభుత్వాలు మారుతున్న షెడ్యూల్డ్ కులానికి చెందిన దండాసి జాతి ప్రజల బతుకులు ఇంకా అంధకారంలోనే ఉన్నాయి. తమ బతుకుల్లో వెలుగులు నింపాలని, తమను అన్ని రకాలుగా ఆదుకోవాలని దశాబ్దాలు తరబడి కోరుతున్నా వారి కోరిక నెరవేరక పోవడంతో వీరి బతుకులు అగమ్య గోచరంగా తయారయ్యాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనూ, రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాల్లోని దండాసి జాతి ప్రజలు జీవన విధానం కడు దయనీయంగా ఉంది. ప్రభుత్వాలు మారుతున్న వీరి బతుకులు వెలుగులు లేక నేటికీ చీకటి మయంగానే ఉంది. దుర్భరమైన దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నారు.దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సామాజికంగా ఆర్థికంగా విద్యాపరంగా రాజకీయంగా నేటికీ ఈ జాతి ప్రజలు అభివృద్ధి చెందలేదు. గ్రామాల్లో ఈ జాతి వారు నేటికీ గ్రామ శివారులో గుడిసెలు నిర్మించుకుని కటిక పేదరికం అనుభవిస్తూ నివసిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆవిర్భావం నుంచి రెవిన్యూ వ్యవస్థలో భాగమైన కార్ణీ, కరణాలకు సహాయకులుగా 'తలయారి' పేరుతో ఈ దండాసి జాతి వారు ప్రభుత్వం నుంచి పరిమిత గౌరవ వేతనం పొందేవారు. రెవిన్యూ వ్యవస్థలో తమ విధుల్లో నానా కష్టాలు పడుతూ సేవలు అందించేవారు. 1983 సంవత్సరంలో దివంగత నేత ఎన్టీఆర్ నాయకత్వంలో టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్ణీ కరణాల వ్యవస్థను రద్దు చేశారు. ఆ తర్వాత రెవిన్యూ వ్యవస్థలో ఏర్పాటు అయిన వివిఓ లకు సహాయ కారులుగా పనిచేశారు. కొన్నేళ్ల తర్వాత వీఆర్ ఓ వ్యవస్థ అమల్లోకి వచ్చింది. వీరి వద్ద కూడా సహాయకులుగా పనిచేస్తున్నారు. తలయారి అన్న పేరు పిలుపులో బాగోలేదని గుర్తించి దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వీరికి విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ లుగా గుర్తిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేశారు. వీరు వీఆర్ఏలుగా గత 20 ఏళ్లుగా పనిచేస్తున్నారు. తలయారి నుంచి వీఆర్ఏ గా నామకరణం అయినప్పటికీ వీరి ఉద్యోగాలు రెగ్యులర్ కావు. కాంట్రాక్ట్ ఉద్యోగులుగా కూడా గుర్తింపు లేదు. కేవలం చాలీచాలని గౌరవ వేతనంతో దండాసి జాతీయులైన వీఆర్ఏలు గ్రామాల్లో పనిచేస్తున్నారు. దశాబ్దాల తరబడి ఈ కులంలోని వీరు రెవెన్యూ వ్యవస్థలో బండ చాకిరి చేస్తున్నారు. గ్రామాల్లో ఎటువంటి సంఘటన జరిగిన ప్రకృతి వైపరీత్యాలు తుఫాన్ లు, అగ్ని ప్రమాదాలు, వరదలు వచ్చిన సమయంలో ముందుగా కాపలా కాసేది వీరే. ముఖ్యంగా వివిధ సంఘటనలో ప్రాణాలు కోల్పోయిన శవాల వద్ద కూడా కాపలా కూడా వీరే ఉంటారు. గ్రామాల్లో విద్యుత్ సరఫరా లేని రోజుల్లో కిరోసిన్ దీపాలు వెలుగులో దీపాలు పట్టుకుని కాపలా కాసేవారు. తహసిల్దార్ కార్యాలయాలు లోపల, ఆరుబయట ప్రతిరోజు వీరే పరిశుభ్రం చేస్తారు. ప్రస్తుతం వీరికి ఇచ్చే గౌరవ వేతనంతో కుటుంబాలతో జీవనం సాగించాలంటే కష్టతరంగా మారింది. వీఆర్ఏలుగా చేస్తున్న దండాసి జాతి పరిస్థితి ఇలా ఉంటే ఇదే జాతి వారు గ్రామాల్లో నివసిస్తున్న ఇళ్లకు ఇప్పటికీ పూర్తిస్థాయిలో విద్యుత్ సౌకర్యం లేదు. పాలకులు ఉచిత విద్యుత్తు సౌకర్యం ఈ జాతి వారికి కల్పిస్తున్నప్పటికీ విద్యుత్ బల్బులు విద్యుత్ సర్వీస్ వైరు విద్యుత్తు వైరింగ్ మెటీరియల్ కొనుగోలు చేయాలన్న ఆర్థిక వనరులు లేక విద్యుత్తు కనెక్షన్లు ఇళ్లకు వేయించుకోలేకపోతున్నారు. దీంతో అంధకారంలోనే ఇళ్లల్లో జీవిస్తుంటారు. వీరు నివసిస్తున్న వీధుల్లో అక్కడక్కడ గ్రామాల్లో పంచాయతీ విద్యుత్ స్తంభాలకు విద్యుత్ బల్బులు ఉండవు. వీధుల్లో పంచాయతీలు పారిశుధ్యం పనులు కూడా చేపట్టరు. వీరు నివసిస్తున్న వీధుల్లో ఉన్న డ్రైనేజీల్లో మురుగునీరు నిల్వ ఉంటుంది. వీటిని కూడా ప్రభుత్వ శాఖలు తొలగించే పరిస్థితులు కనిపించవు. గ్రామాల్లో ఈ జాతి ప్రజలకు ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి హామీ పథకం పనులే దొరుకుతాయి. ఇతర కూలీ పనులు వీరి దరికి చేరవు. అటవీ ప్రాంతానికి అర్ధరాత్రి సమయంలో వెళ్లి ఉదయానికల్లా వెదురు కర్రలతో ఇంటికి చేరుకుంటారు. తెచ్చుకున్న వెదురుతో చాపలు, బుట్టలు, తడకలు అల్లుకుని గ్రామాల్లో అమ్మి జీవనం సాగిస్తారు. ఈ కులవృత్తి కూడా ప్రస్తుతం కనుమరుగయ్యే పరిస్థితి దాపురించింది. ఈ సామాజిక వర్గంలో విద్యాభివృద్ధి అసలు కనిపించదు. ప్రభుత్వ వరంగా ఉద్యోగాలు శాతం కూడా కనిపించని పరిస్థితి నెలకొంది. ఈ జాతికి సంబంధించిన విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చదవాలంటే ప్రవేశాలు పొందలేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ పాఠశాలలో చదవాలంటే కుల ధ్రువీకరణ పత్రాలు ఉండాలి. కుల ధ్రువీకరణ పత్రాలు స్థానికంగా ఉన్న తహసిల్దారులకు మంజూరు అధికారం లేదు. వీరికి రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్ మంజూరు చేయాలి. ఈ సర్టిఫికెట్ కోసం నోటరీ అఫిడవిట్ కావాలి. గెజిటెడ్ ఆఫీసర్ దండాసి కులమని ధ్రువీకరించి సంతకం చేయాలి. గ్రామాల్లో ఇతర కులస్తులైన గ్రామ పెద్దలు కూడా వీరు దండాసి కులం వారని ధ్రువీకరించి సంతకాలు చేయాలి. కుల ధ్రువీకరణ పత్రాలు సంబంధించి ఫారాలు కొనుగోలు చేయాలి. ఇవన్నీ సమకూర్చిన తరువాత వీఆర్ఓ, ఆర్ఐ, తహసిల్దార్లు విచారణ చేసి ఆర్డీవోకు కులం సర్టిఫికెట్ కోసం మంజూరుకు ప్రతిపాదన చేయాలి. తహసిల్దార్ కార్యాలయం నుంచి ఆర్డిఓ కార్యాలయంకు ఫైలు వెళ్లిన తర్వాత ఆర్డీవో కార్యాలయం వారికి ఖాళీ సమయాల్లో ఈ కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేస్తారు. దీని వలన కుల ధ్రువీకరణ పత్రాలు అందేసరికి దరఖాస్తుదారులకు నెలలు కాలం పడుతుంది. కుల ధ్రువీకరణ పత్రం మంజూరు కోసం ఈ కష్టాలు పడలేక ఆర్థిక పెట్టుబడులు పెట్టలేక ఈ కులంకు చెందిన విద్యార్థులను వారి తల్లిదండ్రులు స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చదివించడం లేదు. పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో చదివించరు సరి కదా ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా వీరి దరికి చేరవు. కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు కోసం కష్టాలు పడలేక ప్రభుత్వ పథకాలు కూడా వదులుకుంటున్నారు. 90 శాతం మంది ఈ జాతి ప్రజలకు ఫోన్లు లేవు. సెల్ ఫోన్ లేక ఆధార్ కు ఫోన్ నెంబర్ లింకులు లేవు. బ్యాంక్ పాస్ పుస్తకాలు కూడా లేవు. బ్యాంక్ పాస్ పుస్తకాలు ప్రారంభించాలంటే నగదు నిల్వలు ఉండాలి. వీరి వద్ద ఆర్థిక వివరాలు లేక బ్యాంకు పాస్ పుస్తకాలు ప్రారంభించ లేని పరిస్థితులు ఈ జాతి ప్రజలకు దాపు రించాయి. సరైన తిండి, బట్ట లేక ఉపాధి కల్పించే కులవృత్తులు కనుమరుగు కావడంతో దయనీయ పరిస్థితిలో వీరి బతుకులు కొట్టుమిట్టాడుతున్నాయి. ఈ జాతి ప్రజల్లో అనారోగ్యం పాలైతే మందులు కొనుగోలు చేసుకునే శక్తి సామర్థ్యాలు లేవు. దీంతో జబ్బులు నయం చేసుకోలేక గ్రామాల్లో అనేక మంది మృత్యువాత పడుతున్న సంఘటనలు కోకొల్లలు. కటిక పేదరికం వల్ల జీవనోపాధి కోసం అనేకమంది గ్రామాల్లో సంచార జీవనం గడుపుతున్నారు.తమ జాతి వారికి కుల ధ్రువీకరణ పత్రాలు స్థానిక తహసిల్దారుల ద్వారా మంజూరు చేయాలని దశాబ్దాలుగా కోరుతున్నా ప్రభుత్వాలకు ప్రజాప్రతినిధులకు మానవత్వం కరువైందని దండాసి జాతి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. షెడ్యూల్డ్ కులానికి చెందిన తమ జాతికి రకరకాల నిబంధనలతో కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయక పోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు తహసిల్దార్ ద్వారా కులధృవీకరణ పత్రాలు మంజూరు చేయాలని అభ్యర్థిస్తున్నారు. షెడ్యూల్డ్ కులంలోని భాగస్వామ్యంగా ఉన్న కులాలకు తహసిల్దారులు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేస్తున్నారని, తమ జాతి ప్రజలకు మాత్రం రకరకాల నిబంధనలతో ఆర్డీవోలు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయక పోవడం పట్ల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుల ధ్రువీకరణ పత్రాల కోసం కష్టాలు పడలేక అక్కడక్కడ గ్రామాల్లో 10వ తరగతి, ఇంటర్మీడియట్ పాసైన విద్యార్థులు ప్రభుత్వ ఉద్యో గాల కోసం దరఖాస్తులు చేయక వివిధ పట్టణాలకు వలస వెళ్లి హెూటళ్లలోనూ, కూలి పనులు చేసుకుంటున్నారు. తమ బతుకులు పాలకులు ఎప్పుడు అభివృద్ధి చేస్తారోనని దండాసి కులస్తులు ఎదురుచూస్తున్నారు. తాము పడుతున్న కష్టాలను ప్రభుత్వం పరిశీలించి తమ సమస్యలను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

విద్యార్థులు మెరుగైన ప్రతిభ కనబరచాలి

ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు

విశాలాంధ్ర-మందస: వేసవి శిక్షణ కాలంలో నేర్చుకున్న అంశాలపై ప్రతిభ కనబరచాలని మండలం బాహడపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈ.శ్రీనివాసరావు అన్నారు. గురువారం పాఠశాల ఆవరణలో గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో 30 రోజుల వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంను సద్వినియోగం చేసుకున్నందుకు విద్యార్థులను, ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించినందుకు గ్రామస్తులను అభినందించారు. గ్రామ కమిటీ అధ్యక్షులు ఎస్. ఉమాపతి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు ప్రతి ఏడాది నిర్వహిస్తామని, పాఠశాలకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులను జ్ఞాపికలతో సత్కరించారు. బోధించిన అంశాలపై విద్యార్థులకు గ్రాండ్ టెస్ట్ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ ఉపాధ్యక్షులు కర్రీ తాతారావు, క్యాషియర్ రాపక. కేశవరావు, ఎస్ఎంసి చైర్మన్ కరగాన. వల్లభ రావు మరియు ఉపాధ్యాయులు సార. భాస్కరరావు, దాసరి ఈశ్వరరావు, వంకల పాపారావు, రాపాక వల్లభ రావు, శాలిన శ్రీహర్ష, పసుపురెడ్డి కాంతారావు, సాలిన శిరీష, భాష్యం మోహన రావు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.